నిరసన గళం

- నూతన వక్ఫ్ చట్టానికి వ్యతిరేకంగా ముస్లింల ఆందోళన
- హక్కులను హరించే చట్టాన్ని రద్దు చేయాలని డిమాండ్
- కోడుమూరులో భారీ ర్యాలీ


కోడుమూరులో వక్ఫ్ సవరణ బిల్లుకు వ్యతిరేకంగా ర్యాలీ నిర్వహిస్తున్న ముస్లింలు

కోడుమూరు రూరల్ : వక్ఫ్ సవరణ బిల్లును ఆమోదించి చట్టం చేయడంపై నిరసనలు పెల్లుబికుతున్నాయి. ముస్లింల మనోభావాలను దెబ్బతీసే ఈ చట్టాన్ని వెంటనే రద్దు చేయాలనే ఆందోళనలు తీవ్రమవుతున్నాయి. వక్ఫ్ చట్టాన్ని వ్యతిరేకిస్తూ మంగళవారం కోడుమూరులో ముస్లింలు పాతబస్టాండ్ నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆవాజ్ కమిటీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సుభహాన్ మాట్లాడుతూ వక్ఫ్‌బోర్డు అస్తులను కబ్జా చేసేందుకు కేంద్రంలోని బీజేపీ సర్కారు కుట్ర పన్నిందని ఆరోపించారు. అందులో భాగంగానే వక్ఫ్ సవరణ బిల్లు తీసుకొచ్చిందన్నారు. దీనికి టీడీపీ, జనసేన పార్టీల మద్దతు ఇచ్చి ముస్లింలను దగా చేశాయన్నారు. రాబోయే


తహసీల్దార్ వెంకటేష్ నాయక్‌కు వినతిపత్రం అందజేస్తున్న మత పెద్దలు

రోజుల్లో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ఇక నుంచి మైనార్టీలు వారిని నమ్మరన్నారు. తొలి నుంచి బీజేపీ మైనార్టీలపై వివక్ష చూపుతుందన్నారు. ఇప్పటికే ఎన్‌ఆర్సీ, యూసీసీ, ట్రిపుల్ తలాక్, 370ఆర్టికల్స్ రద్దు లాంటి చట్టాలను తీసుకొచ్చిందన్నారు. ఇప్పుడు ముసింల అభివృద్ధికి సంబంధించిన వక్ఫ్ ఆస్తులపై మోదీ సర్కారు కన్ను పడిందన్నారు. దీనికి రాష్ట్రంలోని తెలుగుదేశం, జనసేన వత్తాసు పలికి తమకు ద్రోహం చేశాయని చెప్పారు. ఈ కొత్త చట్టాన్ని వెనక్కు తీసుకునే వరకు తమ ఆందోళనలు కొనసాగుతాయని హెచ్చరించారు. అనంతరం తహసీల్దార్ వెంకటేష్ నాయక్‌ను కలిసి డిమాండ్లతో కూడిన వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఆవాజ్ కమిటీ, ముస్లిం మైనార్టీ సంఘాల పెద్దలు ఆఫీస్ అజీమ్ సాబ్, ఆప్సర్‌ఫారూఖ్, మహమ్మద్ ముస్తఫా, సాజిత్ అలీ, మౌలానా రహంతుల్లా, షఫీ, ఆర్.ఖాజా, మహమ్మద్, బషీర్, ఇక్బాల్, ఇంతియాజ్, నిసార్, జబ్బార్, జలీల్, గఫూర్‌మియ్యా, గద్వాల రఫీక్, మాలిక్ బాషా తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

పాఠశాల అభివృద్ధికి విరాళం


హెచ్‌ఎంకు నగదు అందజేస్తున్న దాతలు

పాణ్యం: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల అభివృద్ధికి మాజీ ఎమ్మెల్సీ మహ్మద్ ఇక్బాల్ రూ. 74 వేలు విరాళం ఇచ్చారు. మంగళవారం ఆయన అనుచరులు హెచ్‌ఎం మేరీ సునీతాను కలిసి నగదు అందజేశారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ.. గతంలో పాఠశాలకు క్రీడా పరికరాల కోసం రూ. 40 వేల విలువైన క్రీడా పరికరాలు అందించినట్లు చెప్పారు. ఇన్‌చార్జి హెచ్‌ఎం జిలాని, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కిటకిటలాడిన మూలపెద్దమ్మ ఆలయం


అమ్మవారిని దర్శించుకునేందుకు వచ్చిన భక్తులు

గడివేముల: భక్తుల కొంగుబంగారమై విరాజిల్లుతున్న గడివేముల మూలపెద్దమ్మ ఆలయం మంగళవారం భక్తులతో కిటకిటలాడింది. ఆలయానికి వివిధ ప్రాంతాల నుంచి వందలాది మంది తరలివచ్చారు. అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. వేకువజాము నుంచే భక్తుల తాకిడి నెలకొంది. అమ్మవారికి కుంకుమార్చన, ఆకుపూజ వంటి విశేష పూజలు చేశారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆలయ సిబ్బంది ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు


గాయపడ్డ మాధవరెడ్డి

పాణ్యం: మండల కేంద్రంలోని స్టీల్ ప్లాంట్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలయ్యాయి. మంగళవారం కొణిదేడు గ్రామానికి చెందిన మాధవరెడ్డి పాణ్యం వస్తుండగా రోడ్డు పక్కన ఆగిన ట్రైలర్ ట్రక్కు ఎలాంటి సిగ్నల్, హెల్పర్ లేకుండా సడన్‌గా రోడ్డుపైకి వచ్చింది. దీంతో మాధవరెడ్డి బైక్‌ను అదుపు చేయలేక ట్రైలర్ ట్రక్కును ఢీకొన్నాడు. ఈ ఘటనలో మాధవరెడ్డి గాయపడ్డాడు. అతన్ని చికిత్స నిమిత్తం ఆటోలో నంద్యాలకు తీసుకెళ్లారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదంపై ఆరా తీశారు. ఎలాంటి సిగ్నల్ లేకుండా ట్రైలర్ రోడ్డుపైకి రావడంతో ప్రమాదానికి కారణమని ప్రాథమికంగా పోలీసులు గుర్తించారు.

ఆటో ఢీకొని వృద్ధురాలి మృతి


కాటసాని రామలక్ష్మమ్మ

పాణ్యం: ఆటో ఢీకొని వృద్ధురాలు మృతిచెందిన ఘటన మండల పరిధిలోని కొణిదేడు భూపనపాడు రస్తాలో మంగళవారం చోటుచేసుకుంది. ఏఎస్‌ఐ ఫజులుల్లా వివరాల మేరకు.. కొణిదేడు గ్రామానికి చెందిన కాటసాని రామలక్ష్మమ్మ (65)పొలం వద్ద ట్రాక్టర్ దిగి రోడ్డు దాటుతుండగా భూపనపాడు వెళ్తున్న ఆటో వేగంగా వచ్చి ఢీకొంది. రామలక్ష్మమ్మ తీవ్రంగా గాయ పడింది. ఆమెను కుటుంబ సభ్యులు శాంతిరామ్ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో మృతిచెందింది. మృతురాలికి ఇద్దరు కుమారులు ఉన్నారు. మొదటి కుమారుడు రవిరెడ్డి ప్రస్తుతం కొణిదేడు ఎంపీటీసీ సభ్యుడిగా ఉన్నారు. రెండో కుమారుడు రాజా రెడ్డి రైతు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమి త్తం నంద్యాల ప్రభుత్వాస్పత్రికి తరలించారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘట నా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేశారు.

మద్యానికి దూరంగా ఉండండి


మద్యపానం వల్ల కలిగే నష్టాలను వివరిస్తున్న ఏసీ హనుమంతరావు

కోడుమూరు రూరల్: యువత మద్యపానానికి దూరంగా ఉండి చక్కగా చదువుకుని ప్రయోజకులు కావాలని ఎక్సైజ్ శాఖ అసిస్టెంట్ కమిషనర్ హనుమంతరావు సూచించారు. మంగళవారం గూడూరు మండలంలోని పెంచికలపాడు విశ్వభారతి హాస్పిటల్‌లో మద్యపానం వల్ల కలిగే నష్టాలపై మెడికల్ విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏసీ మాట్లాడుతూ మద్యపానం వల్ల ఆరోగ్యం దెబ్బతింటుందన్నారు. కార్యక్రమంలో సీఐ జయరాంనాయుడు, కోడుమూరు ఎక్సైజ్ ఎస్‌ఐ లక్ష్మి, లీగల్ టీం సభ్యులు, కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

నేడు మండల మీట్

సి.బెళగల్: మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఎంపీపీ బొంతల మునెప్ప అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ రాణెమ్మ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం ఉదయం 11 గంటలకు స్థానిక మండల పరిషత్ సమావేశ భవనంలో జరిగే ఈ సమావేశానికి అన్ని శాఖల అధికారులు ప్రగతి నివేదికలతో హాజరుకావాలన్నారు. సభకు హాజరు కాని అధికారులపై జిల్లా ఉన్నత అధికారులకు నివేదించటం జరుగుతుందని తెలిపారు.

చీరకొంగు ట్రాక్టర్‌కు తగిలి..

కర్నూలు (రూరల్): కర్నూలు మండల పరిధిలోని నిడ్జూరు -మునగాల పాడు గ్రామాల మధ్యలో దుర్గమ్మ గుడి సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ మహిళ దుర్మరణం చెందారు. కర్నూలు తాలూకా పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. కర్నూలు నగర పరిధిలోని స్టాంటన్‌పురానికి చెందిన శేఖర్ తన కుటుంబ సభ్యులతో కలిసి మంగళవారం రాత్రి సొంత ఆటోలో రాజోలి గ్రామంలోని సోదరి ఇంట్లో జరిగే శుభకార్యానికి బయలుదేరాడు. మునగాలపాడు సమీపంలో భార్య సుగుణమ్మ (35) చీరకొంగు గాలికి బయటకు రాగా అదే సమయంలో ఎదురుగా వస్తున్న ఇసుక ట్రాక్టర్ టైర్‌కు చుట్టుకుంది. దీంతో ఆటోలోని మహిళ రోడ్డుపై పడి అక్కడికక్కడే మృతిచెందింది. ఈ మేరకు మృతురాలి భర్త శేఖర్ ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తాలూకా ఎస్‌ఐ చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు. కాగా మృతురాలికి ఇద్దరు కుమారులు, కుమార్తె సంతానం. శుభకార్యానికి వెళ్తుండగా జరిగిన ఈ సంఘటనతో బాధిత కుంటుంబ సభ్యులు, బంధువులు శోకసంద్రంలో మునిగిపోయారు.

ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత


మూలపెద్దమ్మను దర్శించుకుంటున్న మాజీ ఎమ్మెల్యే లబ్బి వెంకటస్వామి కుటుంబ సభ్యులు

గడివేముల: ఆధునిక జీవితంలో ప్రతి ఒక్కరూ తీవ్ర ఒత్తిడికి గురవుతున్నారని, ఇష్ట దైవాన్ని స్మరించుకోవడం ద్వారా మానసిక ప్రశాంతత లభిస్తుందని నందికొట్కూరు మాజీ ఎమ్మెల్యే లబ్బి వెంకటస్వామి అన్నారు. మంగళవారం గడివేముల మూలపెద్దమ్మను కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు. అమ్మవారికి కుంకుమార్చన, ఆకుపూజ చేసి మొక్కులు తీర్చుకున్నారు. ఆయన్ను ఆలయ సిబ్బంది సన్మానించారు. జెడ్పీటీసీ సభ్యుడు ఆర్‌బీ చంద్రశేఖరరెడ్డి, పార్టీ మండల కన్వీనర్ మధుసూదనగుప్తా, వైఎస్సార్‌సీపీ నాయకులు నంద్యాల వెంకటేశ్వర్లు, సంజీవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు వేతనాలు చెల్లించాలి


ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న జిల్లా సహాయ కార్యదర్శి నాగన్న

ఓర్వకల్లు: ఉపాధి కూలీలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పస్తులు పెడుతున్నాయని, తక్షణమే ఉపాధి పెండింగ్ బిల్లులను విడుదల చేయాలని వ్య.కా.స జిల్లా సహాయ కార్యదర్శి నాగన్న డిమాండ్ చేశారు. మంగళవారం మండలంలోని లొద్దిపల్లె గ్రామ పరిధిలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కూలీలను ఉద్దేశించి నాగన్న మాట్లాడుతూ.. గత నెలలో ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ మండలంలోని పూడిచెర్ల వద్ద నిర్వహించిన బహిరంగ సభలో ఉపాధి కూలీల పెండింగ్ బిల్లులను రెండు, మూడు రోజుల్లో విడుదల చేసేందుకు కృష చేస్తామని ప్రకటించారని, ఇంతవరకు ఒక్క బిల్లులు చెల్లించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి పెండింగ్ బిల్లులు విడుదల చేయాలని కోరారు. అదే విధంగా వేసవిని దృష్టిలో పెట్టుకుని పని ప్రదేశాల్లో నీడ కోసం పందిళ్లు, మజ్జిగ, ఓఆర్‌ఎస్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచాలన్నారు. సంఘం మండల నాయకులు రామస్వామి, ఎఫ్‌ఏ మహేష్ పాల్గొన్నారు.

బడిఈడు పిల్లలంతా బడిలోనే ఉండాలి


బడిలో చేరిన విద్యార్థులతో డీఈఓ శామ్యూల్‌పాల్

కోడుమూరు రూరల్: బడిఈడు పిల్లలంతా బడిలోనే ఉండాలని డీఈఓ శామ్యూల్‌పాల్ సూచించారు. గూడూరు మండలంలో బడి బయట ఉన్న 48 మంది పిల్లలు తిరిగి పాఠశాలల్లో చేరారో లేదో తెలుసుకునేందుకు మంగళవారం ఆయన ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. బడిలోనే విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో ప్రత్యేకంగా మాట్లాడి చదువు ఆవశ్యకతను వివరించారు. చదువుతోనే పిల్లలకు చక్కటి భవిష్యత్ ఉంటుందని తల్లిదండ్రులు ఈ విషయాన్ని గుర్తించి బాగా చదివించుకోవాలని సూచించారు. పిల్లల చదువు కోసం పాఠశాలల్లో అనేక మౌలిక వసతులు కల్పించడం జరిగిందన్నారు. వచ్చే ఏడాది నుంచి తల్లిదండ్రులతో పాటు పిల్లలు వలస వెళ్లకుండా సీజనల్ హాస్టళ్లను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో గూడూరు ఎంఈఓలు సునీలమ్మ, నాగరాజు, హైస్కూల్ ఉపాధ్యాయులు, పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మహిళలకు సంక్రమించే వ్యాధులపై అవగాహన


సదస్సులో మాట్లడుతున్న డాక్టర్ సోనాలి

కర్నూలు(రూరల్): మహిళలకు వచ్చే వ్యాధులపై మండల పరిధిలో గార్గేయపురం గ్రామంలో మంగళవారం అవగాహన కల్పించారు. డిప్లమ హెల్త్ ఎడ్యుకేషన్‌లో భాగంగా గ్రామ మార్కెట్ కమిటీ హాల్‌లో నిర్వహించిన ఈ సమావేశంలో ట్రైనర్స్ రాజేశ్వరి, రంగమ్మ, డాక్టర్ సోనాలి మాట్లాడారు. మహిళలకు నెలసరి బహిష్టు, రొమ్ము క్యాన్సర్, గర్భాశయ క్యాన్సర్‌పై అవగాహన కల్పించారు. ముఖ్యంగా ఆడవారు 30 సంవత్సరాలు నిండిన తర్వాత నుంచి వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. నెలసరి సమయంలో వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని చెప్పారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సోమేశ్వరమ్మ, కుటుంబ సంక్షేమ కేంద్రం ప్రిన్సిపాల్ డాక్టర్ లక్ష్మీనర్సయ్య, గ్రామ పంచాయతీ కార్యదర్శి పురుషోత్తం, సూపర్ వైజర్ కరుణ, సీఓ సుధాకర్‌రెడ్డి, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

చోరీ కేసులో ఆభరణాల రికవరీ


వివరాలను వెల్లడిస్తున్న డీఎస్పీ హేమలత

ఆదోని అర్బన్: గత నెల 28వ తేదీన వెంకన్నపేటలో లక్ష్మిశ్వేత ఇంట్లో జరిగిన చోరీ కేసులో నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకొని, ఆభరణాలను రికవరీ చేశారు. సోమవారం స్థానిక టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో డీఎస్పీ హేమలత నిందితుడు వడ్డే రవికుమార్‌ను, అతని వద్ద స్వాధీనం చేసుకున్న బంగారు చైన్, నల్లపూసల దండ, తాళిబొట్టును మీడియాకు చూపించి వివరాలను వెల్లడించారు. పట్టణంలోని వడ్డేగేరికి చెందిన రవికుమార్ గత నెల 28వ తేదీన వెంకన్నపేటలో లక్ష్మిశ్వేత ఇంట్లో చొరబడి ఆమె మెడపై కత్తి పెట్టి బంగారు ఆభరణాలను బలవంతంగా లాక్కొని వెళ్లాడని తెలిపారు. లక్ష్మిశ్వేత ఇచ్చిన ఫిర్యాదు మేరకు ముద్దాయి రవికుమార్‌ను ఈనెల 14వ తేదీన రైల్వేస్టేషన్ వద్ద అదుపులోకి తీసుకొని, అతని వద్ద బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. దర్యాప్తులో భాగంగా అనుమానితుడిగా రవికుమార్‌ను అదుపులోకి తీసుకొని విచారించడం జరిగిందన్నారు. సదరు వ్యక్తి వద్ద చోరీ చేసిన మొత్తం ఆభరణాలు ఉన్నాయని, మొట్టమొదటిసారిగా ఈ దొంగతనం చేశాడని, ఆర్థిక ఇబ్బందులు వల్ల ఈ దొంగతనం చేసినట్లు తెలిపారు. ఈ కేసును చాకచక్యంగా వ్యవహరించి ముద్దాయిని పట్టుకున్న టూటౌన్ సీఐ రాజశేఖర్‌రెడ్డి, సిబ్బంది రమేష్, ఆంజనేయులు, సురేష్, రామాంజనేయులను డీఎస్పీ అభినందించారు. వేసవి సెలవులు దగ్గరలో ఉన్నాయని, సెలవుల్లో ఊరెళితే తమ పరిధిలో ఉన్న పోలీస్ స్టేషన్‌లో సమాచారం ఇవ్వాలన్నారు.

వాల్మీకి ఆలయానికి స్థలం కేటాయించాలని వినతి


డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న వాల్మీకి సంఘం నాయకులు

ఓర్వకల్లు: మండల పరిధిలోని కేతవరం గ్రామంలో వాల్మీకి మహర్షి దేవాలయానికి స్థలం కేటాయించాలని గ్రామ వాల్మీకి సంఘం నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఆ సంఘం నాయకులు గోవర్ధన్, వెంకటేశ్వర్లు, శివరాముడు, రాజేష్ తదితరులు డిప్యూటీ తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. గ్రామంలో సుమారు 110 వాల్మీకి కుటుంబాలు ఉన్నాయని.. ఏటా వాల్మీకి జయంతిని ఘనంగా జరుపుకుంటామని తెలిపారు. గత ఏడాది గ్రామ సమీపంలోని సర్వే నంబర్ 85లో వాల్మీకి విగ్రహాన్ని ప్రతిష్టించినట్లు చెప్పారు. అయితే ఆ స్థలంలో దాదాపు 50 అడుగల లోతులో ఉన్న క్వారీ గుంతలను చదును చేసి, విగ్రహ ప్రతిష్ఠ చేపట్టినట్లు పేర్కొన్నారు. సదరు స్థలాన్ని వాల్మీకి దేవాలయానికి అనుమతించాలని కోరారు. సంఘం నాయకులు ఆంజనేయులు, కృష్ణుడు, మద్దిలేటి, మహేష్, నాగమద్దిలేటి, సంతోష్‌కుమార్ పాల్గొన్నారు.

ఎస్సీ కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తుల ఆహ్వానం

ఓర్వకల్లు: ఎస్సీ కార్పొరేషన్ ద్వారా సబ్సిడీ రుణాలకు అర్హులైన లబ్ధిదారులు దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీఓ శ్రీనివాసులు తెలిపారు. నిరుద్యోగ యువతీ, యువకులకు స్వయం ఉపాధి పథకాల ద్వారా జీవనోపాధి కల్పించేందుకు సబ్సిడీ రుణాలు అందజేస్తున్నట్లు పేర్కొన్నారు. 2025–26 ఆర్థిక సంవత్సరానికి గాను ఎస్సీ కులాలకు చెందిన యువతీ, యువకులకు ప్రభుత్వం 40 శాతం సబ్సిడీతో రుణాలు మంజూరు చేస్తుందన్నారు. మండలానికి మొత్తం 17 యూనిట్లు మంజూరు చేసిందన్నారు. ఇటుకల తయారీ పరిశ్రమ, నాలుగు చక్రాల వాహనం, ఫొటో అండ్ వీడియోగ్రఫి స్టుడియో, వర్మికంపోస్టు ఎరువుల తయారీ పరిశ్రమ, మూడు చక్రాల ఆటోలు–2, ప్లంబింగ్ అండ్ ఎలక్ట్రీషియన్ సర్వీసు సెంటర్లు–1, సబ్బుల తయారీ, పట్టువస్త్రాల తయారీ, ఆర్‌ఓ ప్లాంట్ నిర్వహణ, చేపల పెంపకం, జ్యూట్ బ్యాగ్‌ల తయారీ, 3 చక్రాల ఆటో, స్వీట్ బేకరి, కోయర్ తయారీ, సరుకులు తరలించే వాహనం, 4 చక్రాల వాహనం తదితర యూనిట్లకు నిర్దేశించిన బ్యాంకుల పరిధిలో ఈ నెల 14వ తేదీ నుంచి మే 10వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు సమీపంలోని మీ సేవా కేంద్రాల్లో సంప్రదించాలని తెలిపారు.

వైద్య సేవలను సద్వినియోగం చేసుకోండి

-అడిషనల్ డీఎంహెచ్‌ఓ శారదాబాయి


గడివేముల పీహెచ్‌సీలో రికార్డులను పరిశీలిస్తున్న ఏడీఎంహెచ్‌ఓ

గడివేముల: ప్రభుత్వ ఆసుపత్రుల్లో పేద ప్రజలకు అందుతున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా అడిషనల్ డీఎంహెచ్‌ఓ శారదాబాయి అన్నారు. మంగళవారం గడివేముల పీహెచ్‌సీని ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వైద్య సిబ్బంది ప్రతి ఇంటికి వెళ్లి సర్వే నిర్వహించాలన్నారు. కుష్టు వ్యాధి నివారణకు ప్రభుత్వం అన్ని రకాల చర్యలను తీసుకుంటోందని తెలిపారు. వ్యాధిగ్రస్తులను సకాలంలో గుర్తించి సేవలు అందించాలని తెలిపారు. అవసరమైన వారికి ప్రభుత్వం ఉచితంగా మందులు అందజేస్తుందని చెప్పారు. విధులపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రభుత్వం అందిస్తున్న పథకాల గురించి ప్రజలకు వివరించాలని సూచించారు. సర్వే వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. డాక్టర్లు తేజస్విని, రంజితకుమారి, ఎంపీహెచ్‌ఈఓ మహేశ్వరరెడ్డి, సూపర్‌వైజర్ మనోహర్, ఫార్మసిస్ట్ రాజ్‌కుమార్, ఏఎన్‌ఎం భారతి ఉన్నారు.

అవుట్ సోర్సింగ్ లస్కర్లను రెగ్యులర్ చేయాలి

కర్నూలు(సెంట్రల్): శ్రీశైలం ప్రాజెక్టు కోసం సర్వస్వం త్యాగం చేసిన అవుట్ సోర్సింగ్ లస్కర్లను రెగ్యులర్ చేయాలని కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేపట్టారు. అంతక ముందు జలమండలి నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీగా వచ్చి గాంధీ విగ్రహం ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా అవుట్ సోర్సింగ్ లస్కర్ల సంఘం అధ్యక్షుడు నాగన్న మాట్లాడుతూ.. లస్కర్ల సర్వీసును 62 ఏళ్లకు పెంచాలన్నారు. పర్మినెంట్ ఉద్యోగులతో సమానంగా తమకు వేతనాలు ఇవ్వాలన్నారు. తమ సర్వీసును పరిగణలోకి తీసుకొని పర్మినెంట్ లస్కర్లుగా నియమించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు అక్షయ్, రంగస్వామి, గౌస్, మనోహర్, చెన్నయ్య, హుస్సేనయ్య, రఘురాంరెడ్డి, చెంచిరెడ్డి, రాజశేఖర్ పాల్గొన్నారు.

దాడి కేసులో నలుగురు అరెస్టు

కర్నూలు: నగరంలోని డీ-మార్ట్ వెనుక టీడీపీ ఆఫీసులో ఉన్న శేఖర్ గౌడ్‌పై జరిగిన దాడి కేసులో నలుగురు నిందితులను నాల్గవ పట్టణ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు పంపారు. మంగళవారం ఉదయం నిందితులు భూపని ప్రభాకర్ నాయుడు, కాశి బాబు, రహంతుల్లా, పఠాన్ సలాం ఖాన్ తదితరులు ఆర్టీసీ కొత్తబస్టాండ్ సమీపంలో ఉన్నట్లు సమాచారం అందడంతో నాల్గవ పట్టణ పోలీసులు అరెస్టు చేసి కర్నూలు డీఎస్పీ బాబు ప్రసాద్ ఎదుట హాజరుపర్చగా ఆయన మీడియాకు వివరాలు వెల్లడించారు. శేఖర్ గౌడ్‌ను నిందితులు చంపడానికి ప్రయత్నించారని తెలిపారు. కర్నూలు బృందావన్ నగర్‌కు చెందిన భూషణ్ గౌడ్ ఫిర్యాదు మేరకు నాల్గవ పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తులో భాగంగా నిందితులను అరెస్టు చేసి కోర్టులో హాజరుపరచినట్లు డీఎస్పీ తెలిపారు. నాల్గవ పట్టణ సీఐ మధుసూదన్ గౌడ్, ఎస్‌ఐ చంద్రశేఖర్ రెడ్డి సమావేశంలో పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో నేల సారవంతం


విత్తన గులికలు తయారు చేస్తున్న దృశ్యం

కల్లూరు: ప్రకృతి వ్యవసాయం చేయడం వల్ల నేల సారవంతం అవుతుందని మండల ప్రకృతి వ్యవసాయ ఇన్‌చార్జి ఎస్.మాబువలి అన్నారు. మంగళవారం బొల్లవరం గ్రామంలో ఓ రైతు పొలంలో 28 రకాల ధాన్యాలతో ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీజామృతంతో విత్తన శుద్ధి చేసి నేరుగా లేదా గులికలుగా తయారు చేసుకుని పొలంలో విత్తుకోవచ్చన్నారు. రైతులు వేసవి దుక్కులు దున్నిన తర్వాత ప్రధాన పంట కన్నా ముందు నవ ధాన్యాలను విత్తుకోవాలన్నారు. 45 రోజుల అనంతరం పెరిగిన నవధాన్యాలను కలియదున్నడం వల్ల భూమిలో పోషకాలు పెరుగుతాయన్నారు. దీంతో నేల సారవంతం అయ్యి పంటల దిగుబడి పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది వెంకటేశ్వరమ్మ, రైతులు పద్మావతమ్మ, హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

అప్రమత్తతతోనే అగ్ని ప్రమాదాల నివారణ


ప్రమాదాల నివారణపై ప్రదర్శన ఇస్తున్న అగ్నిమాపక సిబ్బంది

కోడుమూరు రూరల్: అప్రమత్తంగా వ్యవహరించడం ద్వారానే అగ్నిప్రమాదాల నివారణ సాధ్యమని కోడుమూరు అగ్నిమాపక కేంద్రం ఎస్‌ఐ మహబూబ్ దౌలత్ అన్నారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా మంగళవారం సిబ్బంది పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ ఆవరణంలో ప్రదర్శన చేసి అగ్నిప్రమాద నివారణ కరపత్రాలను ప్రజలకు అందజేశారు. ఎస్‌ఐ మాట్లాడుతూ వేసవి కాలంలో అగ్నిప్రమాదాల విషయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ప్రమాదాలు చోటు చేసుకున్న సమయంలో భయపడకుండా బయటపడే మార్గాలను ఎంచుకుని ప్రాణాలు దక్కించుకోవాలన్నారు. అగ్ని ప్రమాదాలు జరిగితే వెంటనే అగ్నిమాపక దళ సిబ్బందికి సమాచారమివ్వాలన్నారు.

బైక్‌కు నిప్పపెట్టిన దుండగులు


కొండాపురంలో కాలిపోయిన బైక్

సి.బెళగల్: ఇంటి దగ్గర నిలుపుకున్న బైక్‌ను గుర్తు తెలియని దుండగులు నిప్పుపెట్టారు. మండల పరిధిలోని కొండాపురంలో ఈ ఘటన జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. కొండాపురం గ్రామానికి చెందిన శాంసన్ అలియాస్ చిన్న నాగరాజు రోజులాగానే సోమవారం రాత్రి బైక్‌ను ఇంటి బయట నిలిపి ఇంట్లో నిద్రించారు. మంగళవారం తెల్లవారుజామున బైక్ మంటల్లో కాలిపోతుండటాన్ని గమనించిన స్థానికులు వెంటనే బాధితుడిని అప్రమత్తం చేశారు. హుటాహుటిన కుటుంబసభ్యులందరూ బయటకు వచ్చి మంటలను ఆర్పివేశారు. అయితే, అప్పటికే బైక్ పూర్తిగా కాలిపోయింది. ఈ ఘటనపై చిన్న నాగరాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తిమ్మారెడ్డి తెలిపారు.

ఎల్లమ్మ దర్శనానికి పోటెత్తిన భక్తులు


ప్రత్యేక అలంకరణలో ఎల్లమ్మ


అమ్మవారి దర్శనానికి భారీగా తరలివచ్చిన భక్తులు

కర్నూలు(రూరల్): నగర సమీపంలోని వెంకాయపల్లె ఎల్లమ్మకు మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. వేకువజాము నుంచే అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు క్యూ కట్టారు. కుంకుమర్చన, ఆకుపూజ చేసి మొక్కులు తీర్చుకున్నారు. వివిధ ప్రాంతాల నుంచి భారీగా తరలివచ్చిన భక్తులతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది.

హోరాహోరీగా బండలాగుడు పోటీలు


బండ లాగుతున్న వృషభరాజులు

సి.బెళగల్: క్రిష్ణదొడ్డి గ్రామంలో శ్రీ కోనా వేంకటేశ్వరుడి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం నిర్వహించిన పాలపళ్ల ఎద్ల బండలాగుడు పోటీలు హోరాహోరీగా సాగాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి 9 జతలు ఎద్లు పోటీలలో పాల్గొన్నాయి. ఇందులో గద్వాల జిల్లా కంచుపాడు గ్రామం ఆంజనేయరెడ్డి ఎద్లు 4,736 అడుగుల దూరం లాగి మొదటి స్థానంలో నిలిచి రూ.40 వేలను, బి.తాండ్రపాడు గ్రామానికి చెందిన వరలక్ష్మి ఎద్లు 4,706 అడుగులతో రెండవ స్థానంలో నిలిచి రూ.30 వేలను, రాయవరం గ్రామానికి చెందిన నల్లారెడ్డి, దైవందిన్నె గ్రామానికి చెందిన నరసింహకు చెందిన సంయుక్త ఎద్దులు 4,250 అడుగలతో మూడవస్థానంలో నిలిచి రూ.20వేలు గెలుచుకున్నాయి. తర్వాతి స్థానాల్లో ఇనగండ్ల గ్రామానికి చెందిన మద్దిలేటి, ఉత్తనూరు గ్రామానికి చెందిన నరేష్‌ల సంయుక్త ఎద్లు, నందవరానికి చెందిన ఆంజనేయులు ఎద్లు, తిప్పనూరు గ్రామానికి చెందిన నాగేంద్ర ఎద్లు నిలిచాయి. పోటీలకు వాఖ్యాతలుగా వేమారెడ్డి, సాయినాథ రెడ్డి వ్యవహరించారు. పోటీలను తిలకించేందుకు వచ్చిన ప్రజలకు, రైతులకు గ్రామ ఉత్సవ కమిటీ సభ్యులు భోజన వసతి కల్పించారు. పోటీలకు వాఖ్యాతలుగా వేమారెడ్డి, సాయి వ్యవహరించారు.

చెరువు అన్యాక్రాంతంపై ఫిర్యాదు


తహసీల్దార్‌కు వినతి పత్రం అందిస్తున్న దృశ్యం

పాణ్యం: మండల పరిధిలోని సుగాలిమెట్ట వద్ద ఉన్న ఓబులమ్మ చెరవు అన్యాక్రాంతం అవుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ఆల్ ఇండియా యూత్ లీగ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవీంద్రనాథ్ అన్నారు. మంగళవారం ఓబులమ్మ చెరువును పరిశీలించారు. 1638 సర్వే నంబరులో 8 ఎకరాల 9 సెంట్లలో ఓ వ్యక్తి సాగు చేసుకుంటున్నా అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని వాపోయారు. ఈ మేరకు తహసీల్దార్ నరేంద్రనాథ్‌రెడ్డికి వినతి పత్రం అందించారు.